దళిత వాడకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

మున్సిపాలిటీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న దళిత సమాఖ్య రాష్ట్రఅధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు

శామీర్‌పేట, ఫిబ్రవరి 24 : దళిత వాడకు రోడ్డు సౌకర్యం కల్పించాలని తెలంగాణ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బీఎన్ రామ్మోహన్ అన్నారు. ప్రజావాణి ఫిర్యాదుతో దేవరయాంజాల్‌లోని తిరుమల కాలనీలో హైడ్రా బృందం నామమాత్రంగా కూల్చివేతలు చేపట్టారని, పూర్తి స్థాయిలో నిర్మాణాలను తొలగించకపోపోవడం వల్ల రోడ్డు కసం ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. హైడ్రా బృందం, మున్సిపాలిటీ కమిషనర్ రోడ్డుకు అడ్డంగా నిర్మించిన ప్రహరీలను పూర్తి స్థాయిలో తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవరయంజాల్ అంబేద్కర్ విగ్రహం నుంచి తూంకుంట మున్సిపాలిటీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి, మున్సిపాలిటీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్, జానకీరాం, ఈశ్వర్, మహేందర్, మురళీ, గోవింద్, శ్రీనివాస్, మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 48మందికి ఉద్యోగాలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో గీతారెడ్డి

శామీర్‌పేట, ఫిబ్రవరి24: జాబ్‌మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గీతారెడ్డి అన్నారు. మూడుచింతపల్లి గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో సోమవారం డీఆర్‌డీవో ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 48 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాబ్స్ మేనేజర్ దివాకర్, వివిధ కంపెనీ ప్రతినిధులు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

ఉత్తరాల ఉద్యమానికి విశేష స్పందన

ఘట్‌కేసర్ పోస్టాఫీస్ నుంచి సీఎంకు ఉత్తరాలను పంపుతున్న పూర్వ విద్యార్థులు

ఘట్ కేసర్, ఫిబ్రవరి 24: గురుకుల్ విద్యాలయానికి పూర్వ వైభవం సంతరించుకునేలా అభివృద్ధి చేయాలని చేపట్టిన సేవ్‌గురుకుల్ ఉత్తరాల ఉద్యమానికి విశేష స్పందన లభిస్తుంది. ఘట్‌కేసర్ పట్టణంలోని గురుకుల్ విద్యాలయం శిథిలావస్థకు చేరుకొని విద్యార్థులకు సరైన సదుపాయాలు లేకపోవడంతో వెంటనే అభివృద్ధి పనులు చేపట్టి పూర్వ వైభవం కల్పించాలని ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్ సేవ్ గురుకుల్ ఉత్తరాల ఉద్యమం చేపట్టారు. మాజీ కోఆప్షన్ సభ్యులు మహ్మద్ అబ్బాస్(ఇమ్ము) సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు స్పీడ్ పోస్ట్ ద్వారా ఉత్తరాలను పంపించారు. కార్యక్రమంలో కంది ప్రేమ్‌కుమార్, వెంకటేశ్, ఆక్తర్, గోదా సురేశ్, జనార్ధన్, మోతి, కేఫా, అభిలాష్ యాదవ్, శ్రీనివాస్‌పాల్గొన్నారు.

ఘనంగా నివాళి

చర్లపల్లి,ఫిబ్రవరి 24: ప్రముఖ పారిశ్రామికవేత్త పబ్బతి రాంచందర్ మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మిరుపాల గోపాల్‌రావు, చర్లపల్లి పారిశ్రామిక వాడ ఐలా చైర్మన్ రోషిరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, పారిశ్రామికవేత్తలు తదితరులు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

బోడుప్పల్: ఆలయ పునర్నిర్మాణంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని బోడుప్పల్ 15వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిచిగురు రేణుక రవికుమార్ అన్నారు. డివిజన్ పరిధిలోని పోచమ్మ నాగదేవతల ఆలయ నిర్మాణానికి రూ. 1,00 116/- చెక్కును ఆలయ నిర్వాహకులకు సోమవారం అందజేశారు.

పేలిన సిలిండర్..తప్పిన ప్రమాదం

శామీర్‌పేట, ఫిబ్రవరి 24 : ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...తూంకుంట మున్సిపాలిటీ పోతాయిపల్లిలో మహంకాళి ఆలయ సమీపంలో ఉన్న తీగుల గోపాల్ రేకుల ఇంట్లో బీహార్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు అద్దెకు ఉంటున్నారు. వారు సోమవారం వంట చేస్తున్న సమయంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో రేకు షెడ్డు కూలిపోయింది. అయితే ఎవరికి కూడా గాయాలు కాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదం గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా జరిగినట్టు స్థానికులు ఆరోపించారు.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

జవహర్‌నగర్, ఫిబ్రవరి 24: కౌకూర్ ప్రాంతంలో గుర్తు తెలియని రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నాయి. ఎస్‌హెచ్‌వో సైదయ్య కథనం ప్రకారం... యాప్రాల్ పరిధిలోని కౌకూర్ ప్రాంతంలో ఈనెల 22న మసీద్ గోడ పక్కన ఓ మహిళ అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. ఆమెను పరిశీలించిన చూడగా అప్పటికే మరణించినట్లు కనిపించిందని, సుమారు 75ఏళ్ళ వయస్సు ఉంటుందని తెలిపారు. మరో ఘటనలో కౌకూర్‌లోని వ్యవసాయ పొలాల్లో ఓ వ్యక్తి మృతదేహాన్ని పరిశీలించిన స్థానికులు అతని పరిశీలించగా అప్పటికే కుళ్ళిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులకు మృతదేహాలను పరిశీలించారు. సుమారు 60ఏళ్ళ వయస్సు ఉంటుందని, మృతుడు భిక్షాటన చేసే వ్యక్తిలా కనిపిస్తుందని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానాకు తరలించామని తెలిపారు. వివరాలకు జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు షురూ

- వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు ప్రారంభం
- ఘనంగా యాగశాల ప్రవేశం
- పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



కీసరగుట్ట ఆలయ చైర్మన్ నారాయణశర్మ -పద్మ దంపతుల చేతుల మీదుగా విఘ్నేశ్వర పూజ

కీసర, ఫిబ్రవరి 24: కీసరగుట్ట భవానీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు ప్రారంభమ య్యాయి. మొదటి రోజు పూజలు వేదపండితులు మారుతీసత్యనారాయణ శర్మ,గణపతిశర్మ,బాల్‌రాంశర్మ, మోత్కూరి రవిశర్మలు, ఆలయ చైర్మన్ నారాయణశర్మ-పద్మ దంపతులతో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మొదటి రోజు చైర్మన్ నారాయణశర్మ వేద పండితులతో కలిసి యాగశాలను ప్రారంభించారు.

ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మొదటి రోజు స్థానిక మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ, ఆలయ ఈవో కట్టా సుధాకర్‌రెడ్డిలు వేదపండితులు కలిసి పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం స్వామివారికి మల్లారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణమందిరంలో ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించి వేద ఆశీర్వచనం చేశారు.

క్రీడలు ప్రారంభం

కీసరగుట్టలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడోత్సవాలను నిర్వహిస్తారు. సోమవారం కూడా ప్రభుత్వ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ క్రీడలను నిర్వహించారు. ఉదయం 10గంటలకుపలు ప్రాంతాల నుంచి సుమారు 2008 మంది విద్యార్థులు సుమారు 174 టీంలకు సంబంధించిన క్రీడకారులు కీసరగుట్టలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకొన్నారు. మధ్యాహ్నం క్రీడలు ప్రారంభం అయ్యాయి.ముఖ్య అతిథిగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివాసేనారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. విజేతలైన క్రీడాకారులకు మన్నెం ఇండస్ట్రీస్ ఎం.డీ. స్వర్గీయ సుబ్రహ్మణ్యం పేరుమీద అతని కుమారుడు మన్నె నాగఫణీంద్ర షీల్డ్, క్యాష్ ప్రైజ్‌లను సుబ్రహ్మణ్యం ట్రస్ట్, ఎంపవర్ కంపెనీ పేరుమీద బహుమతులను ప్రదానం చేశారు.

భక్తులకు అన్నదానం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కీసరగుట్టలో శ్రీ వంశిరాజ్ సంఘం, శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం, రెడ్డి భవన సంఘం, మూన్నుకాపు సంఘం ఆధ్వరంలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు భక్తుల నుంచి అపూర్వ స్పందన లభించింది.

జాతరకు ప్రత్యేక బస్సులు

కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని అన్ని ప్రాంతాల నుంచి జాతర స్పెషల్ బస్సులను నడుపుతామని టీజీఎస్ఆర్‌టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. కీసరగుట్టలో సోమవారం బస్టాండ్ ప్రాంగణం మందు స్పెషల్ క్యాంపును ఆయన సోమవారం ప్రారంభించారు.

ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

కీసరగుట్ట బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా,భక్తులకు ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. కీసరగుట్టలో సోమవారం రాత్రి బందోబస్తు విధుల్లో ఉన్న సివిల్, ట్రాఫిక్,ఇతర విభాగాల అధికారులు,సిబ్బందితో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్‌బాబు మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, భద్రత పరమైన పొరపాట్లు లేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, వీఐపీలతో పాటు సాధారణ భక్తులకు కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డాక్టర్ల బృందంతో పాటు అంబులెన్స్,అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలన్నారు. మహిళా భక్తుల రక్షణ కోసం షీ టీం బృందాల కూడా విధుల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీసీపీ పీవీ పద్మజ, డీసీపీ క్రైమ్ అరవింద్‌బాబు, అధికారులు తధికారులు పాల్గొన్నారు.

పోచారం: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని పోచారం శ్రీ స్ఫటిక లింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల పూజలను ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆలయ పూజారులు మల్లారెడ్డి చేతుల మీదుగా ప్రత్యేక అర్చనలు నిర్వహించి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో ఏఐ ల్యాబ్ ప్రారంభం

ల్యాబ్ ప్రారంభోత్సవంలో ఎంఈవో రంగాచారి, తదితరులు

మేడ్చల్, ఫిబ్రవరి 24: మేడ్చల్ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ ఏఐ ల్యాబ్ ను మండల విద్యాధికారి రంగాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధ ద్వారా పిల్లలకు చదవడం, రాయడం నేర్పిస్తామన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో జిల్లాకు ఆరు పాఠశాలలో చొప్పున ఈ ల్యాబ్‌ను విద్యాశాఖ ప్రారంభించిందన్నారు. అందులో భాగంగా మేడ్చల్‌లో ఈ ల్యాబ్ ను ప్రారంభించినట్లు చెప్పారు. విద్యార్థుల్లో ప్రగతి సాధించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, పాఠశాల హెచ్ఎం రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఇంటర్ పరీక్షలపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 24: మార్చి 5వ తేదీ నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఇంటర్ పరీక్షలపై కో-ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 150 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే ఈ పరీక్షలకు మొదటి సంవత్సరంలో 64 107 మంది విద్యార్థులు, రెండో సంవత్సరంలో 62316 మంది విద్యార్థులు హాజరవుతారని అన్నారు. పరీక్షలకు నాలుగు ఫ్లైయింగ్ స్కాడ్స్, ఐదు సిట్టింగ్ స్కాడ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

ప్రజావాణిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 24:ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై 64 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన ఫిర్యాదులపై సంబందిత శాఖ అధికారులు స్పందించి వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తామని అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం అల్వాల్, మల్కాజిగిరి సర్కిల్‌లో ప్రజావాణి నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీసీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా మసీదుల వద్ద ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో సయ్యద్ మోసిన, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాప్రా: కాప్రా సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒకే ఒక ఫిర్యాదు అందింది. ఏఎస్ రావు నగర్ డివిజన్ కమలానగర్‌లో ఓ వ్యక్తి అనుమతులకు భిన్నంగా అదనపు అంతస్తు నిర్మిస్తున్నాడని, చర్యలు తీసుకోవాలని కోరుతూ టౌన్ ప్లానింగ్‌విభాగానికి ఫిర్యాదు చేశారు.

జవహర్‌నగర్: మా కాలనీ సమస్యలను పరిష్కరించండి మహాప్రభో అంటూ జవహర్‌నగర్ లక్ష్మీనర్సింహాకాలనీకి చెందిన ప్రజలు కలెక్టర్ గౌతం పోట్రుకు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు లక్ష్మీనర్సింహకాలనీ వాసులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో రోడ్డు సమస్యను పరష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేకేచారి, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ రవి, నరేష్, మహేందర్, రాజు, వెంకన్న, వెన్నెల, మౌనిక, స్వప్న, సాయిలు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై పట్టుసాధించాలి

టెక్నికల్ ఈవెంట్‌లో పాల్గొని మాట్లాడుతున్న ఏ ఆర్ పుల్లయ్య

ఘట్‌కేసర్,ఫిబ్రవరి24: ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానమే కీలకపాత్ర పోషిస్తున్నందున విద్యార్థులు దృష్టి సారించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి కార్యదర్శి ఆర్ఏ.పుల్లయ్య అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నిక్స్ 2కే25 సాంకేతిక ఉత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సాంకేతిక ప్రతిభను ప్రోత్సహించేందుకు వివిధ పోటీలు ప్రదర్శనలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ పాటవాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వీటిలో 16 సాంకేతిక పోటీలు, 16 నాన్ టెక్నికల్ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మల్లాడి రమాకాంత్ రెడ్డి ఆయా విభాగాల ప్రిన్సిపాల్‌లు జానకి రాములు, శ్రావణ్ కుమార్, శివకేశవరెడ్డి, కన్వీనర్ జే మోహన్, విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు, జర్నలిస్టులు

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 24: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా కలెక్టరేట్ వద్ద సోమవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అనేక ఒడిదుడుకుల మధ్య వృత్తిబాధ్యతలు నిర్వహిస్తున్నారని, చాలీచాలని వేతనాలతో జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారిందన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడేషన్, హెల్త్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి హరిప్రసాద్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వాలుఏండ్ల తరబడి జాప్యం చేస్తున్నాయనారు.జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కోశాధికారి బెలిదే అశోక్ మాట్లాడుతూ ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రివ్యూ పిటిషన్ వేసి వాదనలువినిపించాలని కోరారు.జిల్లా సహాయ కార్యదర్శి జి.రోజారాణి మాట్లాడుతూ.. మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రి పూట రవాణా సదుపాయం కల్పించాలని, మహిళా జర్నలిస్టులకు భద్రత కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.నిరసన అనంతరం ప్రతినిధివర్గం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పటేల్ నర్సింహులు యాదవ్, కుత్బుల్లాపూర్ అధ్యక్షులు గడ్డమీద అశోక్, మల్కాజిగిరి అధ్యక్షులు పబ్బు మల్లేశ్ గౌడ్, ఉప్పల్ అధ్యక్షులు గంజి కృష్ణ, ప్రధాన కార్యదర్శి రామచంద్రమూర్తి, కూకట్‌పల్లి నాయకులు కట్టెల మల్లేశ్, మేడ్చల్ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల జర్నలిస్టులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శామీర్‌పేట, ఫిబ్రవరి 24 : శామీర్‌పేట కేఎల్ఆర్ జూనియర్ కళాశాల 2102-14 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం జరిగింది. కళాశాలలోని ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ అప్పటి పరిస్థితులు, అధ్యాపకులు, తోటి విద్యార్థులు, ఘటనలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి ప్రిన్సిపాల్ శ్రీకాంత్ రామారాజు, అధ్యాపకులు శివ ప్రసాద్, యాదగిరి, మహేందర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయానికి సౌండ్‌సిస్టమ్ విరాళం

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లోని శ్రీ సహస్ర లింగేశ్వర ఆలయానికి ధరణిరాక్ డ్రిల్స్ కంపెనీ యజమాని పోలేపల్లి కొండల్ రావు, ఆయన కుమారుడు వినయ్ చౌదరి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు చేతులమీదుగా సౌండ్ సిస్టమ్‌ను విరాళంగా అందజేశారు.

జాతరకు వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

ఘట్ కేసర్, ఫిబ్రవరి 24: జాతరకు వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల అయిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి ఎన్ఎఫ్‌సీనగర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. ఎన్ఎఫ్‌సీనగర్‌లో నివాసం ఉంటున్న మంచాల విష్ణు,నవ్య దంపతులు తమ పిల్లలతో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా పడమటి గ్రామానికి ఆదివారం శ్రీ లింగ బసవేశ్వర స్వామి జాతరకు వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వచ్చారు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఆందోళనగురైనవారు పరిశీలించగా బీరువాలోని తులం బంగారునగలు, రూ.5వేల నగదు చోరీకి గురైనట్లు తెలుసుకున్నారు. పక్కన ఉన్న మరో ఇంట్లో నివాసం ఉంటున్న గుత్తుల కమల తన భర్తకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఘట్‌కేసర్‌లోని దావాఖానలో అడ్మిట్ చేశారు. ఇంట్లో ఎవరు లేరని భావించిన దొంగలు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని ఒక తులం బంగారు, వెండి నగల తో పాటు రూ.5వేల నగదును ఎత్తుకెళ్లారు. దీంతో బాధితులు ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా క్లూస్ టీమ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గృహిణి అదృశ్యం

మౌనిక(ఫైల్)

జవహర్‌నగర్, ఫిబ్రవరి 24: గృహిణి అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్ఓ సైదయ్య కథనం ప్రకారం... కార్పొరేషన్ పరిధి బాలాజీనగర్ సేవాలాల్‌తండాలో జాటోతి మౌనిక, భర్త ఉపేందర్‌తో కలిసి నివసిస్తున్నారు. కొంత కాలంగా మౌనిక, ఉపేందర్‌ల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇటీవల భర్త ఉపేందర్ తన సొంతగ్రామమైన తుంగతుర్తికి వెళ్ళిపోయాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న రూ. 26వేలు తీసుకుని మౌనిక ఈనెల 24న ఇంట్లో చెప్పకుండా వెళ్ళిపోయింది. మౌనిక తల్లి సైదమ్మ ఆమె ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. కుటుంబసభ్యులు జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేశారు.

స్క్రాప్ గోదాములో అగ్నిప్రమాదం

మేడ్చల్ రూరల్, ఫిబ్రవరి 24: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని స్క్రాప్ గోదాములో మంటలు చెలరేగి పాత ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. మున్సిపల్ పరిధిలోన అప్పరల్ పార్క్ వద్ద ఉన్న ఓ గోదామును నాలుగు నెలల క్రితం లీజుకు తీసుకొని అందులో పాత ప్లాస్టిక్ వస్తువులను నిల్వ ఉంచారు. సోమవారం అకస్మాత్తుగా గోదాములో మంటలు అంటుకొని ఎగిసిపడ్డాయి. ప్లాస్టిక్ వస్తువులు కావడంతో చూస్తుండగానే గోదాం మొత్తం మంటలు వ్యాపించాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ సమాచారం ఇవ్వగా ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చిన అప్పటికే ప్లాస్టిక్ వస్తువులు మంటల్లో కాలి బుగ్గయ్యాయి. మంటలు అంటుకున్న సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. సుమారు రూ. 30 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు గోదాం నిర్వాహకులు పేర్కొన్నారు. షార్ట్ సర్క్యూట్ తోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుదనిఅనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయానికి సౌండ్‌సిస్టమ్ విరాళం

కాప్రా: ఏఎస్‌రావునగర్ డ